# ఓ పుస్తీ నీ విలువెంత?

సందు మలుపు తిరుగుతూనే యథాప్రకారంగా బాల్కనీ వైపుకి చూసాడు. మనోజ్‌కి బాల్కనీలో కారుణ్య కనపడక పోవడంతో ప్రశ్నార్థకంగా కనుబొమలు ముడివడ్డాయి. ప్రతి రోజూ తను ఆఫీసునుంచి వచ్చే టైముకి చక్కగా ముస్తాబై, బైట నిలబడి, చక్రాల్లాంటి తన కళ్ళని వీధి చివరివరకూ పరిగెత్తించి తనరాకకి ఎదురుచూసే కారుణ్య కనపడకపోవడంతో మనసులో వెయ్యి సందేహాలు బయలు దేరాయి. తరుము కొస్తున్న సందేహాలతో పోటీ పడుతున్నట్లు వచ్చిన మనోజ్ డోర్‌బెల్ అలా నొక్కి చాలా సేపే వుంచిన తరవాత తలుపు తెరుచుకుంది.

తలుపు తీసిన కారుణ్య కళ్ళు ముద్ద మందారాల్లా ఎర్రగా ఉబ్బి ఉన్నాయి. ఎంత సేపటినుంచి ఏడుస్తోందోతెలీదు చంపలనిండా కన్నీటి చారికలు ఎండిపోయి వున్నాయి.

ఢిల్లీలో కాపురం పెట్టిన ఈ వారం రోజుల్లో ఎన్నడూ కారుణ్య ముఖంలో విచారం చూడలేదు.

తలుపు తీసిన కారుణ్య మనోజ్‌ని చూస్తూనే విసురుగా లోపలికెళ్ళిపోయింది. కారణం అర్థమవని మనోజ్ కారుణ్యవెంటే గదిలోకెళ్ళి, ఆమె భుజం మీద చెయ్యి వేస్తూ "ఏమయింది కారుణ్యా?" అన్నాడు ఆప్యాయంగా.

అంత దాకా చూపుల్లోనే తనబాధని భావాలని వ్యక్తపరుస్తున్న కారుణ్య, ఒక్కసారిగా ఎదరకి తిరిగి తన భుజం మీదున్న భర్త చేతిని విదిలించికొట్టి "దగాకోర్! నా ఎదరకి రాకు గెటవుట్" అంది మహంకాళిలా.

"ఎందుకలా అరుస్తావ్ కారణం చెప్పక" అన్నాడు సహనం కోల్పోయిన మనోజ్.

"సిగ్గులేక కారణం చెప్పాలిట" ఎంత నాటకం!

"ఇదిగో చూసుకోండి మీ ప్రేమ నాటకానికి ప్రతిరూపం!" అంటూ ఓ ఉత్తరాన్ని తీసి అతని ముందుకి విసిరింది. అంతదాకా ఆందోళనతో మాట్లాడిన మనోజ్ ముఖంలో రంగులు మారసాగాయి ఆ ఉత్తరం చూడగానే.

"ఇదెక్కడినుంచి తీసావ్? సంస్కారం లేకుండా ఎదరవాళ్ళ ఉత్తరాలు తీసి చదవడానికి సిగ్గుండాలి!" అన్నాడు గర్జిస్తున్నట్లే.

"ఏం తెల్సిపోయిందని భయమా? పోస్టుమేన్ తెచ్చిచ్చాడు" అంది.

మనోజ్ తన ప్రియురాలికి రాసిన ఉత్తరం వెనక ఫ్రం అడ్రసు రాయడం, ఆ ప్రియురాలు ఊళ్ళోలేని కారణంగా, 'అడ్రస్‌గలామె ఊళ్ళోలే'దని తెలియజేస్తూ తిరిగి పంపేసిన ఉత్తరం ఈ సంఘటనకి కారణం అని గ్రహించాడు, ఆ ఉత్తరాన్ని చూస్తూ.

"ఇంతకి యిదెంత కాలం నుంచి జరుగుతోంది? అదెవత్తి? మీకో ఉంపుడుగత్తె వుండగా నన్నెందుకు పెళ్ళాడారు? దాన్నే కట్టుకోలేకపోయారా? మీకువుంచుకోడానికి ఒకత్తి, కట్టుకోవడానికి ఒకత్తీ కావలసొచ్చిందా? పెళ్ళయిన దగ్గరనుంచీ ఎంతో ప్రేమనటిస్తూ ఎంత నాటకం ఆడుతున్నారండీ!! నా కళ్ళుకప్పి నా వెనక మరొకత్తితో సరాగాలాడుతున్నారా? మీ మగాళ్ళెంతకేనా తగుదురండీ!" అంటూ పూనకం పూనిన మనిషిలా ఎదురు తిరిగి నిలబడి దండిస్తున్న కారుణ్యని చూసి కోపం పట్టలేక జవాబుగా లాగిలెంపకాయ కొట్టాడు మనోజ్.

"ఎంత పొగరేనీకు! ఆడదానివి నోరు మూసుకుపడుండక!! నా తిండి తింటూ నన్నే నిలదీసి ప్రశ్నించే హక్కు నీకెవరిచ్చారే? ఇదిగో చెప్తా విను-అది నా ప్రేయసి. నీ దృష్టిలో అది ఉంపుడు గత్తె కావచ్చు. అదీ నేనూ పెళ్ళాడాలనుకున్నాం. అది చాలా బీదింటి పిల్ల, మా అమ్మ, బాబూకి నన్ను పెంచి చదివించినందుకు కట్నం కావలసొచ్చింది. అది తను తేలేకపోయింది. ఆ కట్నం నువ్వు తెచ్చావు.

చాలా కాలంగా అది నామీద ఆశలు పెట్టుకుంది. మేమిద్దరం ప్రేమించుకున్నాం. అదంటే నాకు ప్రాణం, మా అమ్మా, బాబూ కోసం నిన్ను కట్టుకున్నాను. అందుకు నీకే లోటూ రానివ్వకుండా చూసుకుంటున్నాను. నీకు మా ప్రేమ విషయం ఎంత త్వరగా చెప్దామా? అని నేనూ ఎదురుచూస్తున్నాను. మంచిదయింది నీకు నువ్వే తెలుసుకున్నావు. చూడు! నోరు మూసుకుని మా యిద్దరి మధ్యా సర్దుకుని పడుండే మాటయితే నా యింట్లో వుండు. నన్నెదిరించేవాళ్లు నా యింట్లో ఒక్క క్షణం వుండటానికి వీల్లేదు. గెటవుట్ - ఇదే నా ఫస్టు అండ్ లాస్టు వార్నింగ్. మళ్ళీ ఈ విషయం ఎప్పుడూ మాట్లాడకు. నోరెత్తకుండా పడుంటావో, పోతావో తేల్చుకో!" అంటూ అక్కడినుంచి చరచరా వెళ్లిపోయాడు.

అంతే అంతదాకా వున్న ఆవేశం, కోపం ఒక్కసారిగా చల్లారిపోయాయి. కుండ బద్దలయినట్లు కన్నీళ్ళు కారసాగాయి. లావాలా తన్నుకొస్తున్న గుండెల్లో మంటని, బాధని ఎలా ఆపు చేసుకోవాలో తెలీక ఏడుస్తూ కూర్చుంది.

ఇప్పుడయినా మనోజ్ వచ్చి క్షమాపణ అడిగి ఊరడిస్తాడని ఆశించింది. కానీ అతనేం పట్టనట్లే హాల్లో టి.వి. పెట్టుకుని చూడసాగాడు.

ఏడ్చి, ఏడ్చి ఇక ఓపిక లేనట్లు వెల్లకితలా పడుకుని ఆలోచించసాగింది. క్షణక్షణానికీ కసి పెరిగిపోతోంది. ఎలా తీర్చుకోవాలో అర్థమవటంలేదు.

కారుణ్యకి వళ్ళంతా కారం పూసుకున్నట్లుంది. పెళ్ళయిన కొద్ది రోజుల్లోనే మనోజ్ పట్ల పిచ్చిప్రేమని పెంచుకుంది. ఒక్క నిమిషం అతనులేకుండా గడపలేకపోతోంది. ఆఫీసుకెళ్ళిన టైములో ఎడబాటునే సహించడం దుర్లభమనుకునే తను, కేంప్‌లకంటూ వెళ్లిన రెండు రోజులూ రెండు యుగాల్లా క్షణక్షణం అతని నిరీక్షణలో పరితపించే తను ఇంత షాక్‌ని ఎలా తట్టుకోగలుతుంది!? ఆ ఉత్తరం చదివిన దగ్గర నుంచీ పడుతున్న వేదన ఎవరికి అర్థమవుతుంది? 'నాది' అనుకున్న ప్రియాతి ప్రియమైన వస్తువు తనది కాదని తెలిసినప్పుడు కలిగే బాధకన్న దీంట్లో మరొకరికి భాగముందని తెలిసాకా కలిగే బాధ వర్ణనాతీతం. అది పడ్డవాళ్ళకే అర్థమవ్వాలి. పోనీ జరిగిపోయిందేదో జరిగిపోయింది. మనోజ్ ఆ ఉత్తరం చూసి క్షమాపణ అడిగి వుంటే యిలాంటి పిచ్చివేషాలింకెప్పుడూ వెయ్యొద్దని గట్టిగా చీవాట్లేసి బుద్ధిచెప్పాలనుకుంది. కానీ జరిగిందేమిటి? ఒక్కక్షణంలో తన హృదయాన్ని వెయ్యి ముక్కలు చేసి పారేసాడే! ఇంత ధైర్యమా? ఇంత తెగింపా?! పైగా నన్ను పొమ్మంటాడా! 'నా' అన్న వాళ్ళందర్నీ వదిలి, తననే నమ్ముకుని వచ్చినందుకు ఇదా శాస్తి? 'కేంప్‌ల'కంటూ నన్ను మోసం చేసి వెళ్ళేది దాని దగ్గరకేనా? దుర్మార్గుడా! నేనూ చూస్తాను! అంటూ లేచింది.

అది ఢిల్లీ పక్కనేవున్న చిన్న ఊరు. కవరు మీదున్న అడ్రస్ వెతుక్కుంటూ నిరుపమ యింటికెళ్ళి నెమ్మదిగా తలుపు తట్టింది. తలుపు తీసిన అమ్మాయినే రెండు క్షణాలపాటు కర్తవ్యం మరిచి చూడసాగింది కారుణ్య. ఆమెకి తన వయస్సే వుంటుంది. కానీ అందమంతా సొత్తే అన్నంత చక్కటి విగ్రహం. అంతకుముందే ఊరి నుంచొచ్చినట్లు పెట్టె బెడ్డింగు తెలియజేస్తున్నాయి.

"ఎవరు కావాలండీ!" అన్న మాటలకీ లోకంలోకొచ్చి "నిరుపమగారు మీరేనా?" అంది.

"అవును నేనే, రండి లోపలికి" అంది లోపలికి నడుస్తూ. అది చిన్నగది. అందులోనే వంట, పడక, అన్నీను.

"కూర్చోండి" అంది మోడాచూపిస్తూ.

విషయం ఎలా ప్రారంభించాలో అర్థమవని కారుణ్య "నా పేరు కారుణ్య అంటారు. బల్లమీద ఫోటోలోవున్న మనోజ్ భార్యనండీ!" అంది ఆమెనే గమనిస్తూ.

దెబ్బతిన్న లేడిలా 'ఆఁ' అంది. ఆ మాటలకి తట్టుకోలేనట్లు గుండెలమీద చెయ్యేసుకుని, పిచ్చిదానిలా కారుణ్యనే చూస్తూ నిలబడి పోయిన నిరుపమని చూసి లేచి దగ్గరగా వెళ్ళింది కారుణ్య. నిరుపమని నెమ్మదిగా నడిపించుకెళ్ళి మంచంమీద కూర్చోపెట్టింది. జరిగిన విషయాన్నంత వివరంగా చెప్పి "చూడండి నిరుపమగారూ! నా భర్త తనకి పెళ్లయినట్లు మీతో చెప్పినట్లు లేదు. మీకీ విషయం ఇప్పుడే తెలిసినట్లుంది" అంది.

"అవును యిప్పుడే వింటున్నాను. మొన్న వారంరోజుల క్రితం ఊరెళ్తున్నట్లు చెప్పాడు. ఆ తరవాత నేను మా అమ్మ ఆరోగ్యం బాగాలేదని తెలిసి ఊరి కెళ్ళి ఈరోజే వచ్చాను. వెళ్ళే ముందు పెళ్ళికెళ్తున్నట్లు చెప్పలేదే? ఎంత మోసం!" అంది నిరుపమ.

"అవును నిరుపమగారూ! మనోజ్ మీ జీవితంతో చెలగాటాలాడుతున్నాడు. మీరు కన్ను తెరుచుకుంటారన్న ఉద్దేశంతోటే మీవద్దకొచ్చి, మనోజ్ ఆడే కపటనాటకాన్ని బయట పెట్టాను. ఈసారొస్తే బాగా బుద్ధొచ్చేలా గడ్డిపెట్టి పంపండి. ఆ తరువాత ఆయన్ని నేను సరిచేసుకుంటాను" అనిలేవబోయిన కారుణ్య చెయ్యి పట్టుకుని "చూడండి కారుణ్యగారూ! మీరే ఆపని చెయ్యకూడదూ? మీకు పెళ్ళయి వారంరోజులే అయింది, నేనాయన్ని నాలుగేళ్ళుగా ప్రేమిస్తున్నాను. నిజమైన ప్రేమ ఎంత పవిత్రమైనదో ఆడదానిగా మీకు తెలిసేవుంటుంది. మీరుచెప్పినంతతేలిగ్గా ప్రేమించిన వ్యక్తిని వదులుకోడం చాలా కష్టం" అంది.

ఊహించని ఆమె జవాబు విని నివ్వెరపోయింది కారుణ్య. కాస్సేపటికి తేరుకుని "చూడండి నిరుపమగారూ! ఆయన నలుగురి సమక్షంలో, శాస్త్రోక్తంగా వివాహమాడి, నా మెళ్ళో పుస్తెకట్టాడు. మీది ఎంత పవిత్రమైన ప్రేమైనా లోకం హర్షించదు. పైగా మీకిచ్చే బిరుదు 'ఉంపుడుగత్తె' అన్నది మాత్రమే! ఏ కోర్టుకెళ్ళినా నాదే రైటవుతుంది" అంది.

"అవును నిజమే! కళ్ళూ, చెవులూ లేని కోర్టులు పవిత్రమైన ప్రేమని తెలుసుకోలేవు. పెళ్ళయి పదిరోజులయిన మీకే మనోజ్ అంటే అంత అధికారం ప్రేమ లభిస్తే, నాలుగేళ్ళుగా ఆరాధిస్తూ, ప్రేమిస్తూ అతనికి భార్యలాగే మెలుగుతూన్న నాకెంత అధికారం ప్రేమ వుండాలి? నిజానికి అతను నన్ను కాదు మిమ్మల్నే మోసగించాడు. నిజమైన ప్రేమ నేనంటే వుందని, తల్లితండ్రుల కట్నంకోసం మిమ్మల్ని పెళ్ళాడానని అన్నాడని మీరే చెప్పారు. మిమ్మల్ని పెళ్ళాడింది పెద్దలకోసం, నన్ను ప్రేమిస్తోన్నది తన కోసం. కాబట్టి మీరు మా ప్రేమని అర్థం చేసుకుని అడ్డుతొలగండి" అన్న నిరుపమ మాటలకి శిలలా నిలబడి పోయింది కారుణ్య.

"ఏమిటి? ఎంత సాహసం! పుస్తె కట్టించుకున్న నన్నే పొమ్మనే అంతదాకా వచ్చారా మీరిద్దరూకూడా!" అంది ఆవేశంగా.

"పుస్తె! పుస్తె! కాసు, అరకాసు పుస్తె నాకు నీతులు బోధించే అంత హక్కుని గడించి పెట్టిందా మీకు? ఇదిగో వినండి. మనోజ్‌తో పరిచయం అయిన దగ్గర నుంచి అతన్నే నా భర్తగా ఆరాధిస్తున్నాను. అతనూ నన్ను ప్రేమించాడు. కాబట్టి పుస్తె కట్టకపోయినా, లోకం నన్ను ఉంపుడుగత్తె అన్నాసరే అతనే నా భర్త. నన్ను భార్యలాచూసుకుంటూ మిమ్మల్ని వివాహమాడి, నిజానికి మిమ్మల్నే మోసగించాడు.

మిమ్మల్ని మోసగించాడని మీరతనికి విడాకులిచ్చేస్తే మేం హాయిగా బ్రతుకుతాంకదా! కానీ వదలరు. కారణం. పెళ్ళాడారుగనక, డబ్బుతో నా ప్రియుడిని కొని పుస్తె అన్న లైసెన్సు

బిళ్ళ మీమెళ్ళో, నలుగుర్లో కట్టించుకున్నారు గనక, భార్య బిరుదు పొందారుగనక భర్త ఎలాంటి మోసాలుచేసినా బాగు చేసుకుంటారు. ఆ బాగు మీలాగే నేనూ ఎందుకు చేసుకోకూడదూ? కట్నం ఆశ చూపించి, ఆడబ్బుతో మా మధ్య అడ్డుగోడ కట్టి మీరా పుస్తె కట్టించుకుని మమ్మల్ని విడదియ్యాలని చూస్తున్నారు. ఇది వరకటిలాగే నిర్మలమైన ప్రేమ అతనికి నాయందున్నపుడు అతన్ని నేనెందుకు పొమ్మనాలి?"

"అయితే మీ ఉద్దేశం?" అంది కోపం పట్టలేని కారుణ్య.

"పోనీ ఓ పని చెయ్యనా? మిమ్మల్నిలా మోసగించినందుకు చీవాట్లెట్టనా? అదీ కాదంటే మరోపని చేద్దాం. మనిద్దరికీ అతనంటే ప్రేమ, హక్కులున్నాయి కాబట్టి అతన్నే రమ్మని, ముగ్గురం కూర్చుని విషయం తేల్చేసుకుందాం. అతని నిర్ణయమే నా నిర్ణయం!" అన్న నిరుపమ మాటలకి తల వంచుకుంది కారుణ్య.

మనోజ్‌వస్తే జరిగేదేమిటో తెలుసు. మనోజ్, నిరుపమనే ప్రేమిస్తున్నాడు. తన్ని పెళ్ళాడాడు గనక బాధ్యత తీర్చుకుంటున్నాడు. డబ్బాశగల పెద్దవాళ్ళ మూర్ఖత్వానికి తను బలైపోయింది. ఒక్క కట్నం అడిగే తల్లితండ్రులకే కాదు యిచ్చే తల్లితండ్రులకి కూడా శిక్ష పడినపుడే దేశం బాగుపడుతుంది. నిరుపమ కట్నం ఇవ్వలేనింట్లో పుట్టడం ఆమె తప్పా? కట్నమివ్వగలిగిన ఇంట్లో పుట్టడం తనది తప్పా? డబ్బిచికొన్నాను. నాకతనియందు హక్కుందంటున్నాను. నాలుగేళ్ళుగా అతన్ని భర్తలా ఆరాధించుకుంటూ బ్రతుకుతున్న తనదే హక్కంటోంది నిరుపమ.

పదుగుర్లో కట్టిన పుస్తెచాటున జరిగే అన్యాయాలెన్ని? ఘోరాలెన్ని?? ముఖ్యముగా కొడుకుల్ని కన్న తల్లిదండ్రులు కట్నాలాశతో మార్కెట్లో పెట్టి వేలకి, లక్షలకి అమ్మి తనలాంటెందరి ఆడపిల్లల గొంతులు కోస్తున్నారు! ఈ నాగరికపు ప్రపంచంలో పెరుగుతున్న ఈ తరం యువకులు తమ కోర్కెల్ని చంపుకోలేక, తమలోని భావాలని బైటపెట్టుకోలేక, అటు పెద్దవాళ్ళని ధిక్కరించి వివాహాలు చేసుకోలేక, వారియందున్న గౌరవానికో, భయానికో తలొగ్గి ఇటు నాలాంటి ఆడపిల్లల జీవితాలనిలా నాశనం చేస్తున్నారు. భర్తకి లోకువ భార్య. అందుకు భార్య భర్తని ఎదిరించకూడదు. ఏం చేసినా నోరెత్తకుండా పడుండాలని బోధిస్తుంది మనోజ్ వంటి పురుషలోకం. ఏది ఏమైతేనేం! నాలాంటి అభాగినుల జీవితం అరిటాకు వంటిది అయింది.

ఇపుడు నాకు రెండే మార్గాలు-నోరు మూసుకుని వాళ్ళిద్దరి మధ్యా పతివ్రతలాగన్నా పడుండాలి, లేదా ధిక్కరించి నలుగురిలో నవ్వులపాలయి బైటికెళ్ళాలి. ఈ బాధ నిరుపమకి లేదు. ఆమెకి పుస్తె లేదు గనుక-పుస్తె కట్టించుకున్న ఆడ దానికే బాధలూ, అవమానాలు, సమాజం, గౌరవం!! ఇప్పుడు నేను బాగా ఆలోచించి అడుగెయ్యాలి. ఈ పుస్తె నా మెళ్ళో వున్నది లోకంకోసం, పెద్ద వాళ్ళకోసంకాదు. ఒకరి తృప్తికి పుస్తె ఎందుకు? తన తండ్రి మాత్రం ఏం చేసాడు? డబ్బుందన్న అహంతో తన జీవితాన్ని నాశనం చెయ్యలేదూ?

నా క్లాస్‌మేట్ రమేష్ వచ్చి 'సార్! మీ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటానండీ, నాకు కానీ కట్నం వద్దు, కారుణ్యని చూసిన దగ్గరనుంచీ ఆమె అంటే నాకు గౌరవం, ప్రేమ ఏర్పడ్డాయి అదే నన్ను ఈనాడు మీ కాళ్ళ దగ్గరికిలా రప్పించిం'దన్న మాటలకి తన తండ్రి అతన్ని అవమానించి పంపేడు. కారణం అతను బీదవాడు. స్కాలర్‌షిప్‌ల మీద చదువుతున్నాడు.

పైగా కట్నం తీసుకోకుండా రిజిస్టర్‌మేరేజ్ చేసుకుంటానన్నాడు. అవును తండ్రి హోదాకి సరితూగే సంబంధం కాదది. అందుకే చీదరించి కొట్టి మరీ పంపినప్పుడు, చిన్నబుచ్చుకుని వెళ్ళిపోతుంటే, గదిలో కూర్చుని కళ్ళనీళ్ళెట్టుకుందే తప్ప, తండ్రిని ఎదిరించి అతన్నే పెళ్ళాడతానని అనలేకపోయింది.

'కారుణ్యా! ఈ జన్మలో పెళ్ళంటూ చేసుకుంటే నిన్నే చేసుకుంటాను. లేదా జీవితాంతం బ్రహ్మచారిగా వుండిపోతాను. నువ్వెక్కడున్నా నిన్నారాధించే వ్యక్తి, నీ మంచికోరే వ్యక్తి ఒకడున్నాడని మర్చిపోకు. నీకు ఏ అవసరం వచ్చినా నేనున్నాను. కారుణ్యా!' అన్న అతని మాటలు చెవుల్లో రింగుమంటున్నాయి.

బీదవాళ్ళ మనసుల్ని గాయపర్చి, వారి కోరికల్ని చంపి, వారి మనోభావాలని తెలుసుకోని డబ్బుగల కొందరు తల్లితండ్రులు తమ గౌరవాలని ఇలాగే నిలబెట్టుకుంటున్నారు. 'దాని ఫలితం? తమ వంటివారి జీవితాలు నాశనమవడమే!'

ఇప్పుడన్నా నిజాన్ని తెలుసుకున్నాను. నేనూ ఈ నాగరికయుగంలో పుట్టాను. బి.సి. కాలం వాళ్ళల్లా లోకానికి భయపడను. పిరికిదానిలా చావను. భర్త భార్యని మనస్ఫూర్తిగా ప్రేమించిన నాడే భర్త దైవమనుకునే కాలంయిది. పుస్తె కట్టించుకున్న ఆడదేకాదు పుస్తెని పవిత్రంగా పూజించవలసింది. శాస్త్రోక్తమైన మంత్రాలతో వాగ్దానాలతో కట్టిన పురుషుడు కూడా ఆ మంత్రాల అర్థాలు తెలుసుకున్ననాడే ఆ పుస్తెకి విలువ. సమాజం మగవాడికో నీతి, ఆడదానికో నీతి బోధిస్తున్నంతకాలం ఆడవాళ్ళ జీవితాలిలాగే బలైపోతాయి. కన్ను తెరుచుకుని ఆడది తన్నుతానే రక్షించుకోవాలి. నా భవిష్యత్ గురించి నేనే యిప్పుడు ఆలోచించుకుని, ఓ నిర్ణయానికి రావాలి.

నన్ను ఆరాధించి, ప్రేమించిన రమేష్ అండ నాకూ వుంది. అతనే నా దైవం! ఎవరేం చేస్తారో నేనూ చూస్తాను, అతని దగ్గరకే వెళ్ళిపోతాను! అనుకుని మెళ్ళోని పుస్తెలతాడుని తీసి నిరుపమ మంచం మీద పెట్టేసి లేచి గబగబా బైటికొచ్చేసింది కారుణ్య.

– స్వాతి, నవంబరు **1988**